మా స్కూల్‌కు సార్లు కావాలి..

450మంది విద్యార్థులు | **ఆరుగురే ఉపాధ్యాయులు**



ఒకే తరగతి గదిలో ఉన్న 85మంది విద్యార్థులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. అన్ని రకాల వసతులు కల్పిస్తోంది. ఎన్నో పథకాలను అమలుచేస్తోంది. కాని కొన్నిచోట్ల అవి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండడం లేదు. దీంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

- ఒకే తరగతి గదిలో 85మంది
- విద్యార్థులకు తప్పని తిప్పలు



తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాల

తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. 450మంది విద్యార్థులకు కేవలం ఏడుగురు ఉపాధ్యాయులే ఉన్నారంటే సమస్య ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఆ ఉన్నవారిలో మరో ఉపాధ్యాయుడు ఇటీవల ఉద్యోగ విరమణ చెందారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించినా ఈ పాఠశాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకే గదిలో 85మంది

ఈ పాఠశాలలోని 6నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 450 మంది ఉన్నారు. అంత మందికి కేవలం ఆరుగురు ఉపాధ్యాయులే విద్యను బోధిస్తున్నారు. 10వ తరగతిలో 64మంది విద్యార్థులు, 9వ తరగతిలో 85మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఒకే తరగతిలో 85మంది విద్యార్థులను ఉంచి బోధించాల్సిన దుస్థితి వచ్చిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

చేరాలనుకున్నా.. చేరలేక..

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాల ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి చెందిన అనేక మంది విద్యార్థులు తెల్లాపూర్ పాఠశాలలోనే ఎక్కువగా చేరుతున్నారు. ఈయేడాది కొత్తగా మరో 50 మంది విద్యార్థులు చేరారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా కొంతమందిని తిరస్కరించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.

సౌకర్యాలు ఉన్నా.. టీచర్లు లేక..

తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలోని సౌకర్యాలు కార్పొరేట్‌కు దీటుగా ఉన్నాయి. అయినా ఉపాధ్యాయుల కొరత వల్ల నాణ్యమైన విద్య లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18మంది ఉండాల్సి ఉంది

విద్యాశాఖ నిబంధనల ప్రకారం 450మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో 18మంది ఉపాధ్యాయులు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నిబంధనలు ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలు ఉన్నా..



తమ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత ఉంది. అన్ని సబ్జెక్టులు బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– రేష్మ, విద్యార్థిని, పదో తరగతి

ఉపాధ్యాయులను నియమించాలి



మాకు తెలుగు బోధించే ఉపాధ్యాయులు కూడా లేరు. ఉన్న వారే అన్ని సబ్జెక్టులను బోధిస్తున్నారు. వెంటనే మాకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి.

– జస్వంత్, విద్యార్థి, పదో తరగతి

క్లుప్తంగా

రథోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు



రథోత్సవంలో పాల్గొన్న ఎంపీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల పూరీ జగన్నాథ స్వామి రథోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ స్వామి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖలోనే కొనసాగించాలి: వీఆర్‌ఓ జేఏసీ



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

నారాయణఖేడ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5,700మంది పూర్వ వీఆర్‌ఓలను రెవెన్యూ శాఖలోనే తిరిగి కొనసాగించాలని వీఆర్‌ఓల జేఏసీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డిని కోరారు. జేఏసీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ బాధ్యులు అశోక్, అంజన్న, సత్యనారాయణ, షణ్ముఖం, గోరఖ్‌రావు, ఈశ్వర్, సంపత్‌రెడ్డి, సునీల్, రాములు, విష్ణు, ఖాదర్, ముగ్దూమ్ తదితరులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జీఓ 121ను రద్దుచేసి తమ ఉద్యోగ భద్రత, సర్వీసు, పదోన్నతులకు నష్టం కలుగకుండా రెవెన్యూశాఖలోనే పునర్నియమించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



చెత్తను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ ఆదివారం తనిఖీ చేశారు. రాజీవ్‌చౌక్‌లో చెత్త తరలింపు, పలు కాలనీల శుభ్రత పనులను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మంగల్‌పేట్‌లోని పలు నివాసాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను విద్యుత్తు సిబ్బంది సహాయంతో సరిచేయించారు. ఆయన వెంట శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

బాధితులకు ఎంఐఎం భరోసా



పరామర్శిస్తున్న మొహిద్‌పటేల్

నారాయణఖేడ్: పుణే సమీపంలో అయిదు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహిద్‌పటేల్ పరామర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన అయిదుగురి కుటుంబాలను ఆయన ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

నీరు నిలిచిపోకుండా చర్యలు

పటాన్‌చెరు టౌన్: వర్షాకాలంలో మైత్రి మైదానంలో నీరు నిలిచిపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి క్రీడా మైదానాన్ని మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు. నీరు నిలిచే ప్రదేశాల గురించి చర్చించారు. అనంతరం మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు, సభ్యులతో ముచ్చటించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎల్లయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్

బ్రిడ్జి వద్ద పొంచి ఉన్న ప్రమాదం

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో ఓ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన ఝరాసంగం నుంచి జహీరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మాచ్‌నూర్ శివారులో ఉన్న బ్రిడ్జికి రెండువైపులా ఉన్న గోడలు కూలిపోయాయి. ఆ ప్రాంతం పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోవడంతో బ్రిడ్జి గోడలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకంగా ఉన్న బ్రిడ్జి

ప్రహరీని పట్టించుకోండి

జహీరాబాద్ టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ కూలి నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రహరీ గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. ఏడాది గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడంలేదని పలువురు వాపోతున్నారు. దీంతో పశువులు, పందులు, కుక్కలు కార్యాలయం లోపలికి వస్తున్నాయని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.



కూలిన తహసీల్దార్ కార్యాలయం గోడ

సంక్షిప్త వార్తలు

◆ **'ప్రయివేట్'కు అవకాశం ఇవ్వొద్దు**

కంది(సంగారెడ్డి): వర్క్ ఆర్డర్ పెంచడంతోపాటు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓడీఎఫ్‌లో కోట్లాది రూపాయల విలువగల యంత్రాలను బ్రేక్ డౌన్ చేస్తూ వర్క్ ఆర్డర్‌ను ప్రయివేటు పరిశ్రమలకు ఇస్తున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగుల కోసం నిర్మించిన సంరక్షణ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.

◆ **చార్జీలు పెంచడం తగదు**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ శివారులోని ప్రకృతి నివాస్‌లో మెయింటెన్స్ ఛార్జీలు పెంచడంపై కాలనీ వాసులు ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి మెయింటెనెన్స్ పనులు చేయించడం లేదన్నారు. పనులు చేయకున్నా ఛార్జీలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే నిర్వాహకులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన**

జహీరాబాద్ టౌన్: హరే రామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జామునే భక్తులు తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో భక్తి గీతాలు ఆలాపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ **ఘనంగా బసవ జ్యోతి కార్యక్రమం**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో ఆదివారం బసవ జ్యోతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. న్యామతాబాద్ అప్పారావు కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వగురువు మహాత్మ బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా బసవేశ్వరుడు అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించారన్నారు.

◆ **సమస్యలను పరిష్కరించాలి**

మునిపల్లి(అందోల్): హాస్టల్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర సభ్యుడు రమేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆదివారం కంకోల్ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ దుర్గేష్‌తో మాట్లాడారు. మరుగుదొడ్లు, గేటు, ప్రహరీ, తాగునీరు కల్పించాలని కోరారు.

◆ **పోరాటాలు తప్పవు**

సంగారెడ్డి టౌన్: దళితులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోరాటాలు తప్పవని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని ఆ సంఘం కార్యాలయంలో ఉద్యమ తరగతుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ కోసం పోరాడుతామన్నారు.

◆ **మానవ మనుగడకు అగ్నిహోత్రం**

వట్‌పల్లి(అందోల్): అగ్నిహోత్రం పర్యావరణ రక్షణతోపాటు మానవ మనుగడకు దోహదపడుతుందని విశ్వఫౌండేషన్ సభ్యుడు శంకర్ తెలిపారు. మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులతో కలిసి సామూహిక అగ్రిహోత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గృహాల్లో అగ్నిహోత్రం చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని చెప్పారు. శ్రీరామ్‌సేనా సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **సహకరించిన వారికి కృతజ్ఞతలు**

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి 14వ వార్డులో రోడ్డు వెడల్పుకు సహకరించిన గ్రామస్తులకు కౌన్సిలర్ శంషాబాద్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన వార్డులో రెండు ఫీట్లు రోడ్డును వెడల్పు చేశామన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు

సంగారెడ్డి టౌన్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఇంటర్ ఉత్తీర్ణతతో ఉద్యోగాలు ఉన్నాయని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 3 2004 నుండి 3 జనవరి 2008 మధ్య జన్మించిన వారు అర్హులని ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు httpr//afni pathvayu.cdac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

వర్షం కోసం ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కల్హేర్(నారాయణఖేడ్): వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని నిజాంపేట్ మండలం మునిగేపల్లిలో ముస్లింలు ఆదివారం ప్రత్యేకం ప్రార్థనలు చేశారు. గ్రామంలోని మదినా మస్జిద్ పేష్‌ఇమామ్ సఫియొద్దిన్ ఆధ్వర్యంలో సమీపంలోని పటేల్ చెరువు వద్ద నమాజ్ చేశారు. సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని దువా చేశారు. కార్యక్రమంలో ఆలిమ్ సాబ్ అబ్దుల్ వహబ్, నవాబ్ పటేల్, ఎండీ ఇద్రిస్, ఇసాఖ్ పటేల్, అహ్మద్, బాబా, మోహిసిన్, పర్వేజ్, అశ్ఫఖ్, అలీఖ్ పటేల్ పాల్గొన్నారు.

హజ్ యాత్రీకులకు సత్కారం

జహీరాబాద్: హజ్ యాత్రను ముగించుకుని తిరిగి వచ్చిన వారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి పూలమాలలతో సత్కరించి స్వాగతించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావేద్, చిరాగ్‌పల్లికి చెందిన జహూర్‌లను సత్కరించారు. నర్సింహారెడ్డి, పి.నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న అనుపమారెడ్డి

ఘనంగా బోనాల ఉత్సవాలు

నారాయణఖేడ్: మండలంలోని నర్సాపూర్‌లో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తలలపై బోనాలు పెట్టుకుని ఊరేగింపుగా గ్రామంలోగల పురాతన కాళీమాత ఆలయానికి వెళ్లి సమర్పించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని చాప్టా(కె)లో దుర్గామాత బోనాల ఉత్సవాలను సైతం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ పాల్గొన్నారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారిని కోరుకున్నట్టు వారు చెప్పారు.

సేఫ్టీ స్టిక్కర్లు లేకపోతే చర్యలు

జహీరాబాద్ టౌన్: సేఫ్టీ స్టికర్లు లేని ఆటోలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని సీఐ రవి హెచ్చరించారు. ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సేఫ్టీ స్టిక్కరింగ్‌లేని ఆటోలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా భద్రత కోసం ఆటోలకు పోలీసు స్టిక్కరింగ్ వేస్తున్నామని, స్టిక్కర్‌లు ఉన్న ఆటోలో ఎలాంటి భయంలేకుండా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. అయితే ఇప్పటి వరకు కొంత మంది ఓనర్లు స్టిక్కరింగ్ చేయించుకోలేదని, 'మై ఆటో సేఫ్' కార్యక్రమంలో భాగంగా స్టిక్కర్లు లేని 260 ఆటోలను గుర్తించామన్నారు. జహీరాబాద్ టౌన్‌లో 160, చిరాగ్‌పల్లి పీఎస్ పరిధిలో 60, కోహీర్ పరిధిలో 40 ఆటోలకు స్టికర్లు వేయలేదని, వెంటనే ఓనర్లు తమ పరిధిలోని పీఎస్‌కు వెళ్లి వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాద్‌రావు, నరేశ్, కృష్ణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోలను పరిశీలిస్తున్న సీఐ రవి

ఎంపీకి పలు సంఘాల సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీగా గెలుపొంది బాధ్యతలు స్వీకరించి మొదటిసారి వచ్చిన ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఆదివారం వివిధ సంఘాల బాధ్యులు సన్మానించారు. గొల్ల కురుమ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు మల్గొండ ఆధ్వర్యంలో సంఘం బాధ్యులు, అలాగే ముదిరాజ్ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అల్కారి సత్యనారాయణ, విశ్రాంత ఎంపీడీఓ నారాయణ, పెద్దచెల్మడకు చెందిన ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఖేడ్ మండలం జూకల్‌కు చెందిన బంజె వీరన్న భార్య మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందగా షెట్కార్ ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అందరి కృషితోనే అభివృద్ధి సాధ్యం

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి సాయికుమార్ మాజీ జెడ్పీటీసీ మీనాక్షి, ఎంపీటీసీ సభ్యుడు మంద రాజశేఖర్, ఇతర నాయకులు శివకుమార్, స్వప్న భాస్కర్‌లను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీటీసీ మీనాక్షి మాట్లాడుతూ అందరి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమైందన్నారు. కలిసి పనిచేసిన ఎంపీటీసీ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భాస్కర్, గోపులారం మాజీ సర్పంచ్ కీర్తి కుమారి, నాయకులు నాగేశ్, శంకరయ్య, భాస్కర్, శ్రీనివాస్, కన్నా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న సాయికుమార్

భక్తిమార్గాన్ని అనుసరించాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మసీదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో షాపూర్‌నగర్‌కు చెందిన ముద్దపూరం మదన్‌గౌడ్ తన తండ్రి దత్తాత్రేయ జ్ఞాపకార్థం 12 లక్షల సొంత నిధులతో పీర్లను నెలకొల్పేందుకు మసీదు నిర్మించగా ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మదన్‌గౌడ్ కుటుంబ సభ్యులు యాదమ్మ, మంజుల, శివదత్తు, సవన్విత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, చంద్రగౌడ్, మన్సూర్, యాదగౌడ్, హన్మంత్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, లాయక్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



నారాయణఖేడ్: పూర్వ విద్యార్థులు



జహీరాబాద్ టౌన్: కలుసుకున్న విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

నారాయణఖేడ్/జహీరాబాద్ టౌన్: నిజాంపేట్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997– 2002 పదో తరగతి బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఆదివారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఆనాటి తమ జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అధ్యాపకులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే జహీరాబాద్ టౌన్ మండలం న్యాల్‌కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2005–16 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అతిథి ఇన్‌లో కలుసుకున్నారు. ఉపాధ్యాయులు పద్మయ్య, మీనా, ప్రభాకర్, సుధాకర్, నగేశ్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ప్రియాంక, శ్రీను, తుకారాం, శ్రీకాంత్‌రెడ్డి, అన్వేష్, ఖలీల్ పాల్గొన్నారు.